క్లుప్తంగా

నేడు కప్పలదొడ్డిలో మంత్రి జోగి రమేష్ పర్యటన

గూడూరు: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ బుధవారం గూడూరు మండలంలోని కప్పలదొడ్డి గ్రామంలో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.22.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాలను మంత్రి ప్రారంభిస్తారు. అనంతరం వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిపర్తి రవికుమార్ తెలిపారు.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

పెడన: పెడన పురపాలక సంఘం కౌన్సిల్ అత్యవసర సమావేశం బుధవారం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో జరిగే సమావేశానికి అధికారులు, సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలని ఆమె కోరారు.

విద్యార్థినికి అభినందన

నాగాయిలిప్ప(మోపిదేవి): నాగాయిలిప్ప ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని విశ్వనాథపల్లి స్వైలీ గ్రేస్ ఇటీవల జరిగిన ఎన్ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి) మంగళవారం అభినందించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గరికిపాటి సుబ్బారావు, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు బీఎస్ నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మంచినీటి సరఫరా పనులు ప్రారంభం

పెడన: పెడన పురపాలక సంఘ పరిధిలో సమగ్ర మంచినీటి సరఫరా పథకం మొదటి దశ పనులను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ బుధవారం ఉదయం ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ ఎం. అంజయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసియా మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ నిధులతో ఏపీయూడబ్ల్యూఎస్, ఎస్ఎంఐపీ పథకంలో భాగంగా రూ.58.23కోట్లతో ఈ పనులు చేపడుతున్నారన్నారు. స్థానిక బంగ్లా స్కూల్ వద్ద ఈ పనులకు మంత్రి శంకుస్థాపన చేసి ప్రారంభిస్తారని చెప్పారు.

నిత్యాన్నదానం పరిశీలన



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో భక్తులకు అందించే ఉచిత భోజనం రుచికరంగా ఉండాలని ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం అన్నదానాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. నిత్యం భక్తుల సంఖ్య పెరుగుతున్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారి దర్శనంతోపాటు వచ్చిన భక్తులందరికీ ఉచితంగా దేవస్థానం తరఫున అన్నప్రసాదం ఏర్పాటు చేశామని, భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రాములోరికి పూజలు

మచిలీపట్నంటౌన్: రుస్తుంబాదలోని భద్రాద్రి శ్రీరాముల వారి దేవస్థానంలో వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం అగ్నిప్రతిష్ట, ధ్వజారోహణం, చతుస్నానార్చన, గరుడప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం నిత్యహోమం, బేరీ తాండవం, దేవతా ఆహ్వానం, బలిహరణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అనుమకొండ శ్రీధర్, కార్యనిర్వహణాధికారి గోవాడ వెంకటకృష్ణారావు పర్యవేక్షించారు.

మృతురాలి భర్తకు సాయం

గూడూరు: రాయవరం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ సభ్యురాలు రాజులపాటి జయలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందింది. మంగళవారం జరిగిన కార్యక్రమంలో జయలక్ష్మి భర్త రాజుకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని సొసైటీ చైర్మన్ కోళ్ల వీర వెంకట బాలకృష్ణ, సీఈఓ ఆకురాతి వెంకటేశ్వరరావు అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

వెంట్రప్రగడ(పెదపారుపూడి): జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి కె.చంద్రశేఖర్ అన్నారు. వెంట్రప్రగడ గ్రామంలో ఉన్న లేఅవుట్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. నిర్మాణ పనులు జరుగుతున్న ఇంటి వద్ద ఉన్న లబ్ధిదారులతో మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణ పనులు చేసే సమయంలో నీళ్లకు ఇబ్బందిగా ఉందని లబ్ధిదారులు చెప్పగా, స్పందించిన ఆయన పైఅధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఇళ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తే బిల్లులు వెంటనే మంజూరు చేయిస్తామన్నారు. పామర్రు మార్కెట్ యార్డు డైరెక్టర్ చీకుర్తి వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సాగరరాణి పాల్గొన్నారు.

మాట ఇస్తే.. నెరవేరుస్తారు

- ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న సీఎం జగన్
- మూడో విడత ఆసరా నిధుల పంపిణీలో మంత్రి జోగి రమేష్



నందిగామలో నమూనా చెక్కులను అందజేస్తున్న మంత్రి జోగి రమేష్



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

పెడన: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారంటే నిలబెట్టుకుంటారు. ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు ఎంతదూరమైనా ఆయన వెళతారు అని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా పేరుతో ప్రభుత్వం విడుదల చేసిన నిధుల పంపిణీ కార్యక్రమం మంగళవారం మండలంలోని నందిగామ గ్రామంలో నిర్వహించారు. మంత్రికి పెద్ద ఎత్తున మహిళలు స్వాగతం పలికారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మంత్రి అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఏర్పాటు చేసిన సభలో డ్వాక్రా అక్కచెల్లెమ్మలను ఉద్దేశించి ప్రసంగించారు. మన గురించి, మన పిల్లల భవిష్యత్ గురించి ఆలోచనలు చేస్తూ జగనన్న రాష్ట్రాన్ని పాలిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు సెంటు భూమి కూడా ఇవ్వకుండా పాలన చేసిన చంద్రబాబు ఒక్కడే జగనన్నను ఎదుర్కోలేక పవన్ అంటూ సన్నాయినొక్కులు నొక్కుతూ ఇతర పార్టీలన్నిటిని కలుపుకుని కుయుక్తులు పన్నుతున్నారని దుయ్యబట్టారు. 2014 ఎన్నికలలో కలిసి పోటీ చేసి రాష్ట్ర ప్రజల చేతుల్లో చావుదెబ్బ తిన్న చంద్రబాబుకు 2024లో కూడా అదే విధంగా ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలులను మరిచిపోవద్దన్నారు. అమరావతి కావాలా..అమ్మఒడి కావాలా అంటే అమ్మఒడే కావాలని చాలా మంది అంటున్నారని, అలాగే మన పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదువుకుంటుంటే చంద్రబాబు అండ్ కో పార్టీ వారికి నచ్చడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మన పిల్లల కోసం నాడు–నేడు కింద పాఠశాలలను అభివృద్ధి చేస్తూ ఆధునికీకరించి ఇంగ్లిష్ మీడియంలో చదువుకునేలా ప్రోత్సహిస్తుంటే వారికి మింగుడు పడటం లేదని విమర్శించారు. అక్కచెల్లెమ్మలు ఆలోచన చేయాలని, ఎవరు ప్రజాశ్రేయస్సు కోరి పరిపాలన చేస్తున్నారో గుర్తించి వారిని మరిచిపోవద్దని స్పష్టంచేశారు. పెడన మండలంలో 790 సంఘాలలో 7,851 మంది డ్వాక్రా అక్కాచెల్లెమ్మలకు రూ.6,78,72,635 విడుదలయ్యాయని మంత్రి తెలిపారు. ప్రతి పథకం కూడా మహిళలు పేరుమీద వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తున్నారని వివరించారు. ఎంపీపీ రాజులపాటి వాణి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గరికిపాటి చారుమతి, వైస్ ఎంపీపీ యాదంరెడ్డి వరప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు కొండవీటి నాగబాబు, గరికిపాటి వెంకట రామానాయుడు, రాజులపాటి అచ్యుతరావు, దావు భైరవలింగం, కాగిత వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మధుసూదనరావు, ఎంపీడీఓ సుబ్బారావు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి జగనన్న పెద్దపీట

అవనిగడ్డ: దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళాభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో మంగళవారం మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ అవనిగడ్డ మండలంలో 787 మంది పొదుపు సంఘాలకు రూ.9.35 కోట్లు మూడో విడత వైఎస్సార్ ఆసరా అందించామని చెప్పారు. ప్రభుత్వం చర్యలతో మన రాష్ట్రంలో పొదుపు సంఘాల అభివృద్ధి గణనీయంగా పెరిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు పొదుపు సంఘాలకు జీవం పోశాయన్నారు. ప్రముఖ కంపెనీల ఒప్పందాలతో అక్కా చెల్లెమ్మలకు వ్యాపార మార్గాలు చూపిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా మహిళలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.



గరిశపూడిలో గర్భిణులకు సారె బహూకరిస్తున్న మంత్రి జోగి రమేష్

రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, యువనేత సింహాద్రి వికాస్, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, అవనిగడ్డ సర్పంచ్ గౌరుముచ్చు ఉమా, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజల శ్రేయస్సే ముఖ్యం

కృత్తివెన్ను: అమరావతి కంటే రాష్ట్రాభివృద్ధి, రాష్ట్ర ప్రజల శ్రేయస్సే ముఖ్యమని ముఖ్యమంత్రి జగనన్న ఎంచుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. వైఎస్సార్ ఆసరా చెక్కులను గరిశపూడిలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్ట పరిస్థితులలో ఉన్నప్పటికీ తాను ఇచ్చిన మాటను నేరవేర్చడంతో పాటు ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు.

చంద్రబాబు మాదిరి కేవలం తన సామాజిక వర్గానికి, తన పార్టీకి ఉపయోగపడేలా కార్యక్రమాలు చేయడం లేదన్నారు. తొలుత సీఎం జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీమంతం కార్యక్రమంలో పాల్గొని గర్భిణులను మంత్రి ఆశీర్వదించారు. ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, వెంకట్రాజు, సర్పంచ్ నాగార్జున, తహసీల్దార్ రామకోటేశ్వరరావు, ఎంపీడీఓ పిచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ టీయూ ఆవిర్భావ దినోత్సవం

కోనేరుసెంటర్: వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం మంగళవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ షేక్ సలార్ దాదా ట్రేడ్ యూనియన్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. విప్లవాత్మక మార్పులతో విద్యా, వైద్య రంగాల బలోపేతానికి కృషి చేస్తున్నారని చెప్పారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ చరిత్రలో నిలిచిపోయేలా అన్నివర్గాలకు ప్రాధాన్యతను కల్పిస్తున్నారన్నారు. ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ ఇన్ చార్జ్ ఎగ్గోని గాంధీ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక, శ్రామిక వర్గాల పక్షపాతిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. వివిధ ట్రేడ్ యూనియన్ నాయకులు పిండి శ్యాంబాబు (ఎండీయు), ఎన్. కోటేశ్వరరావు (ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ యూనియన్), మద్దెల పాండురంగారావు, అప్పారావు, కల్యాణ్ (ఆటో యూనియన్), జోగి గోపి (భవన నిర్మాణ కార్మిక సంఘం), జక్కుల ఆనంద్‌బాబు, బూరగ రామారావు, పాండు తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న షేక్ సలార్‌దాదా

50 మందికి వైద్య పరీక్షలు

బంటుమిల్లి: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 50 మందికి మోకాలు నొప్పి పరీక్షలు చేశారు. సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో విజయవాడ టైమ్ ఆస్పత్రి వైద్యులు త్రిలోక్ వైద్య సేవలు అందించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ గంగాజలరావు, జె. భాస్కరరావు, కె. నాగభూషణం, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశం

- 2022-23 బడ్జెట్‌లో రూ.21.02 కోట్ల మిగులు
- 2023-24 బడ్జెట్‌లో రూ.11.19 కోట్ల మిగులు
- పెరిగిన ఆదాయ, వ్యయాలు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర పాలక సంస్థ 2023–24 సంవత్సర బడ్జెట్ సమావేశం బుధవారం నిర్వహించనున్నారు. ఇందుకోసం మునిసిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులకు ఇప్పటికే బడ్జెట్ ప్రతులను అందజేశారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన సమావేశం ప్రారంభం కానుంది. సమావేశంలో 2023–24 సంవత్సర బడ్జెట్‌ను నగర పాలక సంస్థ పాలకవర్గం ఆమోదం తెలపనుంది.

బడ్జెట్ ఇలా..

2022–23 సంవత్సరం సవరించిన బడ్జెట్‌లో సాధారణ, మూలధన పద్దుల కింద రూ.11.21 కోట్ల ప్రారంభ నిల్వను చూపారు. అన్ని పద్దుల కింద రూ. 64.23 కోట్లను ఆదాయంగాను, రూ.54.41 కోట్లను వ్యయంగాను, ముగింపు నిల్వ రూ. 21.02 కోట్లుగా చూపారు. ఈ ఏడాదిలో నగర పాలక సంస్థకు వచ్చిన అన్ని రకాల గ్రాంట్‌లను కలుపుకుని అన్ని పద్దులలో ఇప్పటివరకు చేసిన వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని నిల్వ బడ్జెట్‌ను చూపారు. ఇదిలా ఉండగా 2023–24 ఆర్థిక సంవత్సర బడ్జెట్ అంచనాలలో ప్రారంభ నిల్వ రూ.18.02 కోట్లుగా, ఆదాయం రూ. 142.73 కోట్లుగా, వ్యయం రూ. 149.57 కోట్లుగా, ముగింపు నిల్వ రూ. 11.19 కోట్లుగా చూపారు. నగర పాలక సంస్థకు వచ్చిన ఆదాయాన్ని పలు అభివృద్ధి పనులకు కేటాయింపులు చేసి రూ.11.19 కోట్ల మిగులును చూపారు.

పెరిగిన ఆదాయ, వ్యయాలు..

మచిలీపట్నం నగర పాలక సంస్థ ఆదాయ, వ్యయాలు భారీగా పెరిగాయి. 2022–23 బడ్జెట్‌లో ఆదాయం రూ. 64.23 కోట్లుగా ఉండగా.. ఈ ఏడాది బడ్జెట్‌లో ఇది అమాంతంగా రూ. 142.73 కోట్లకు ఎగపాకింది. అలాగే వ్యయాన్ని పరిశీలిస్తే గత ఏడాది బడ్జెట్‌లో వ్యయం రూ. 54.41 కోట్లు కాగా, ఈ బడ్జెట్‌లో రూ. 149.57 కోట్లకు పెరిగింది. గత ఏడాది బడ్జెట్‌కు, ఈ ఏడాది బడ్జెట్‌కు ఆదాయ, వ్యయాలు పెద్ద ఎత్తున పెరిగాయి. ఈ బడ్జెల్‌లో పలు పనుల నిర్వహణకు కేటాయింపులు చేశారు. ఈ ఏడాది బడ్జెట్‌లో సాధారణ నిధుల నుంచి రూ. 4.75 కోట్లను పలు అభివృద్ధి పనులకు కేటాయించారు.

ఉపాధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

మంగళాపురం(చల్లపల్లి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న స్థానిక ఊర చెరువు పూడికతీత పనులను మంగళవారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభించారు. సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ పేరం నాగిరెడ్డి, పంచాయతీ ఈఓ బీవీ సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి చెరువుగా అభివృద్ధి..

ఎమ్మెల్యే సహకారంతో ఉపాధి హామీ పథకం, అమృత్ సరోవర్ పథకం, జల జీవన్ మిషన్ పథకం నిధులతో ఈ చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి తాగునీటి అవసరాలు తీర్చనున్నట్లు సర్పంచ్ నాగేశ్వరరావు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆస్పత్రి ఉద్యోగులకు ఎమ్మెల్యే పేర్ని నాని హామీ



ఆస్పత్రి ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలను ఇప్పించాలని కోరుతూ ఐదు రోజులుగా సర్వజన ఆస్పత్రి ఉద్యోగులు ప్రధాన ద్వారం వద్ద చేస్తున్న ధర్నా కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) మంగళవారం సందర్శించారు. ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) ఆధీనంలో ఆస్పత్రి నడిచేదని, ప్రస్తుతం సర్వజన ఆస్పత్రిగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ వారి పర్యవేక్షణలో నడుస్తోందన్నారు. ఏపీవీవీపీ పరిధిలో ఉన్న తమకు కొన్ని నెలలుగా జీతాలు అందడం లేదని వివరించారు. ఎమ్మెల్యే పేర్ని నాని స్పందిస్తూ ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘ నాయకులు ఉల్లి కృష్ణ, గౌరి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సత్వర న్యాయ సేవలు లక్ష్యం

న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి రామకృష్ణయ్య



సదస్సులో మాట్లాడుతున్న రామకృష్ణయ్య

గూడూరు: అన్యాయం జరిగిన వారికి సత్వర న్యాయ సేవలు అందించడమే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య అన్నారు. కృష్ణా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గూడూరులోని వెలుగు కార్యాలయంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి రామకృష్ణయ్య మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ ఆశయాలను వివరించారు. మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, దేశ స్థాయిలో న్యాయ సేవాధికార సంస్థలు పనిచేస్తున్నాయని చెప్పారు. సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో ఉండేలా సంస్థ ద్వారా ప్రజలకు న్యాయ సేవలు అందిస్తామన్నారు. బాధితులు తెల్లకాగితంపై తమ అర్జీలను సమర్పిస్తే చాలని, లాయర్ల ఖర్చు కూడా అవసరం లేకుండా ఇరుపక్షాలను విచారణ చేసి ఆమోద్యయోగ్యమైన పరిష్కారం చూపిస్తామని చెప్పారు. ప్రతిఒక్కరూ న్యాయ సేవాధికార సంస్థ సేవలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ బీవీ ప్రసాద్, న్యాయవాది సీహెచ్ ముసలయ్య పాల్గొన్నారు.

ప్రయోగాత్మకంగా వేసవిలో మినుము పంట



మినుము పంటను పరిశీలిస్తున్న ఏఓ శివప్రసాద్

కోనేరుసెంటర్: బందరు మండలం సుల్తానగరానికి చెందిన చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు అనే రైతు తన రెండు ఎకరాల మాగాణి భూమిలో రబీ సీజన్‌లో యలమంచిలి 104 మినుము విత్తనం వేసి 120 రోజుల తరువాత పంటను నూర్చాడు. పంట నూర్చిన తరువాత పడిన వర్షాల కారణంగా భూమిలో విత్తనాలు ఉండటంతో అవి మరలా మొలకెత్తాయి. దీంతో మండల వ్యవసాయ శాఖాధికారులు మంగళవారం వెంకటేశ్వరరావు పొలాన్ని సందర్శించారు.

మినుము పంటను పరిశీలించి సదరు పంటను వేసవి పంటగా పరిగణిస్తూ రైతుకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. మినుము కేవలం 80 రోజుల పంట కావున మొదటి దశలో 10 కిలోల డీఏపీని వేయాలని రైతుకు సూచించారు. మినుము ఆకులపై పురుగు ఆశించకుండా ఉండేందుకు వేపనూనె పిచికారీ చేయాలని చెప్పారు. జూన్ మొదటి వారంలో పంట చేతికి అందే అవకాశం ఉన్న నేపథ్యంలో మినుములో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి జి. శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చిరుధాన్యాలలో పోషక విలువలు

కనుమూరు(పామర్రు): చిరుధాన్యాలలో పోషక విలువలు ఉంటాయని, చిరు ధాన్యాల ప్రాధాన్యాన్ని తెలుసుకుని ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో చిరుధాన్యాలను తీసుకోవాలని కనుమూరు ఎంపీటీసీ యార్లగడ్డ పావని, గ్రామ సర్పంచ్ కొడాలి సుఖవేణి తెలిపారు. మండలంలోని కనుమూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ్ పక్వాడా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అంగన్‌వాడీ సిబ్బంది వేసిన పోషణ్ పక్వాడా కార్యక్రమ చిత్ర ప్రదర్శనను తిలకించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీ వరకు ఈ ప్రచార కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. విటమిన్లు, ప్రోటీన్లు కలిగిన సమతుల ఆహారం చిరుధాన్యాల వలనే సాధ్యం అవుతుందని, ఈ నేపథ్యంలో వీటిని రోజూ తీసుకోవాలని అన్నారు. గ్రామ మహిళా పోలీస్ పి.సుధారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు,తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ఆలయాలు ముస్తాబు

కోడూరు: శ్రీరామ నవమి వేడుకలకు రామ మందిరాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. కోడూరు ప్రధాన సెంటర్‌లోని రామాలయం వద్ద గురువారం సీతారామచంద్రస్వామి వారి కల్యాణాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. షిర్డీ సాయి దివ్య ధాన్య జ్ఞాన మందిరంలో స్వామి వార్ల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. లింగారెడ్డిపాలెంలోని శ్రీరామ మందిరాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. బడేవారిపాలెం, ఉల్లిపాలెం, వి.కొత్తపాలెం, మాచవరం, యర్రారెడ్డివారిపాలెం, ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామాల్లోని రామాలయాల వద్ద నవమి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఇద్దరు విద్యార్థులకు ఒక టీచర్!



పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న ఇద్దరు విద్యార్థులు

నాగాయిలిప్ప(మోపిదేవి): మండల పరిధి నాగాయిలిప్ప గ్రామంలోని ఎస్‌డబ్ల్యూ ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఉన్నారు. వీరికి విద్య బోధించేందుకు ఒక ఉపాధ్యాయిని, వంట మనిషి ఇక్కడ పని చేస్తున్నారు. 1922లో ఒకటి నుంచి ఐదు తరగతులు బోధించేలా స్థాపించిన ఈ పాఠశాల ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పించింది. నేడు విద్యార్థులు లేక వెలవెల పోతోంది. మండలంలో ఇద్దరు, ముగ్గురు విద్యార్థులతో నడుస్తున్న ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వానికి ఆర్థిక భారంగా ఇవి మారాయని గ్రామస్తులు అంటున్నారు. రానున్న విద్యా సంవత్సరంలోనైనా ఉపాధ్యాయులను, విద్యార్థులను వేరే పాఠశాలల్లో సర్దుబాటు చేస్తే విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు.

పశువులకు టీకాలు

ముదినేపల్లి రూరల్: పెదగొన్నూరు పశువైద్యశాల పరిధిలోని గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసేందుకు ప్రణాళిక రూపొందించినట్టు పశువైద్యశాల లైవ్‌స్టాక్ అసిస్టెంట్ బి.జోజిబాబు తెలిపారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 25 వరకు ఈ టీకాలు వేస్తామన్నారు. పెదగొన్నూరు, కొరుగుంటపాలెం, అల్లూరు, ఈడేపల్లి, ములకలపల్లి, బొమ్మినంపాడు, వడాలి, పెదకామనపూడి, చినకామనపూడి, చిగురుకోట గ్రామాల్లో టీకాలు వేస్తామన్నారు.

3న మాజీ సైనికుల చలో కలెక్టరేట్

మచిలీపట్నంటౌన్: సమస్యల పరిష్కారం కోరుతూ మాజీ సైనికులు ఏప్రిల్ 3వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహిస్తారని ఇండియన్ ఎక్స్ సర్వీస్‌మెన్ లీగ్ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పోతన వెంకట సీతారామస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మచిలీపట్నంలోని జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే కార్యక్రమానికి జిల్లాలోని మాజీ సైనికులు హాజరుకావాలని ఆయన కోరారు.

వేంకటేశ్వరునికి 108 రజత పుష్పాలు



గుడివాడటౌన్: స్థానిక జగన్నాథపురంలోని పాటిమీద ఉన్న వేంకటేశ్వర స్వామి వారికి భక్తులు 108 బంగారుపూతతో కూడిన రజత తామర పుష్పాలు బహూకరించినట్లు ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం మంగళవారం తెలిపారు. పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ రాజ్‌కుమార్ దంపతులు వీటిని స్వామి వారికి సమర్పించినట్లు తెలిపారు.

ఆలయ అర్చకుల వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామి వారి సన్నిధిలో వీటిని అందజేసినట్లు ఆయన తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం స్వామివారికి నిర్వహించే అష్టదళ పాదపద్మ పూజలను వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ప్రారంభిస్తున్న సందర్భంగా వీటిని స్వామి వారికి సమర్పిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వేద పండితులు వేదాంతం అప్పలాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



మోపిదేవికాలనీ(మోపిదేవి): మోపిదేవి కాలనీలో ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన బత్తుల మధుసూదనరావుకు వైఎస్సార్ బీమా పథకం కింద మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు మృతుని భార్య భాగ్యలక్ష్మికి అందచేశారు. మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్ నందిగం మేరీరాణి, ఉప సర్పంచ్ కోనేరు సుందరసింగ్ బాధితురాలికి ఈ నగదు అందించారు. గ్రామ కార్యదర్శి త్రిపుర సుందరి, నందిగం అభిషేకరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ముదినేపల్లిరూరల్: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంతోనే ఆరోగ్య సంరక్షణ చేకూరుతుందని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ఎంపీడీఓ పి.మల్లీశ్వరి అన్నారు. గురజ వేణుగోపాలస్వామి కల్యాణ మండపంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన పోషణ్ పక్వాడా సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వివిధ రకాల మిల్లెట్ వంటకాలను ప్రదర్శించి వాటిలో ఉండే పోషకాలను వివరించారు.